
సాక్షి బాపట్ల

ఆదివారం । 17 । సెప్టెంబర్ । 2023



హుండీ లెక్కింపు

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండలం పెదకొండూరులో శ్రీ కనకపుట్లమ్మ ఆలయ హుండీ లెక్కింపు శనివారం జరిగింది. రూ.4 లక్షల 89 వేల ఆదాయం వచ్చింది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 2,618 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 136 క్యూసెక్కులు వదిలారు.



నేడు వడ్లమూడికి డిప్యూటీ సీఎం

చేబ్రోలు : వడ్లమూడిలో నిర్మించిన వైఎస్సార్ షాదీఖానా భవనాన్ని ఆదివారం ప్రారంభించనున్నారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం అంజాద్ బాషా ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు.

ప్రతిమదీ మురిసేలా..

చిట్టి చేతుల్లో మట్టి గణపతులు | బాపట్ల సరస్వతి స్మారక ప్రభుత్వ బాలికల హైస్కూల్లో ప్రతిమల తయారీ

- సాక్షి మీడియా, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహణ
- పర్యావరణ పరిరక్షణ కోసమే మహత్తర కార్యక్రమం



వినాయక ప్రతిమల తయారీకి పంపిణీ చేసిన మట్టి ముద్దలను చూపుతున్న విద్యార్థులు

బాపట్ల అర్బన్: సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త నిర్వహణలో శనివారం బాపట్ల పట్టణంలోని ఏజీ కాలేజ్ రోడ్డు సరస్వతి స్మారక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చిన్నారుల చేతుల్లో మట్టి గణపతి కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. భారీగా విద్యార్థులు తరలివచ్చారు. ఉచిత శిక్షణలో మట్టి గణపతులను తయారు చేసి అందరినీ మంత్రముగ్ధులను చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డ్వామా పీడీ శంకర్‌నాయక్ మాట్లాడారు. సాక్షి మీడియా, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల తయారీ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. మట్టి విగ్రహాల వినియోగం ద్వారా కాలుష్యాన్ని కాపాడిన వారమవుతామని చెప్పారు. చిన్నారులు మట్టి విగ్రహాల తయారీలో ఉత్సాహంగా పాల్గొన్నారని ప్రశంసించారు. పర్యావరణాన్ని కాపాడేందుకు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆధ్వర్యంలో జిల్లాలో రెండు లక్షల మొక్కలు నాటినట్టు వివరించారు. విద్యార్థులూ మొక్కల పెంపకంపై శ్రద్ధ చూపాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఎండీ సాధిక్, ఏపీఎస్‌జీసీ అధికారి భాను చంద్ర మూర్తి, ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ పి.రమాదేవి పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందించారు.

విజేతలు వీరే..

పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గణపతిని ఒక్కొక్కరూ ఒక్కో రూపంలో తీర్చిదిద్దారు. ఆ పార్వతీ తనయుడిని సింహాసనంపై ఒకరు కూర్చోబెడితే. మూషిక వాహనంపై మరికొందరు అధిష్టింపజేశారు. బొజ్జ గణపయ్యను మరికొందరు ఆవిష్కరించారు. వివిధ ఆకృతుల్లో లంబోదరుని ప్రతిమలు తయారు చేశారు. మొదటి బహుమతి బి.సుమశ్రీ, ద్వితీయ బహుమతి శృతి, తృతీయ బహుమతి దుర్గా భవాని కైవసం చేసుకున్నారు. వీరితోపాటు ఏడుగురికి కన్సొలేషన్ బహుమతులు లభించాయి. కార్యక్రమం ఆద్యంతం వైభవంగా జరిగింది.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో డ్వామా పీడీ శంకర్‌నాయక్

District sponsor

SAKSHI · SAKSHI DIGITAL MEDIA GROUP · VIVA THE SCHOOL BY VVIT · ఆంధ్రప్రదేశ్ ANDHRA PRADESH AP Pollution Control Board

సంతోషంగా ఉంది



ఏటా వినాయక చవితికి ఇంట్లోనే పూజ చేసుకుంటాం. ఈ ఏడాది పండగకు ముందే గణేశుని విగ్రహాల తయారీలో పాల్గొనే అవకాశం కలగడం ఆనందంగా ఉంది. ఈ పోటీలో పేరు ఇచ్చినప్పటి నుంచి వినాయకుని ప్రతిమ తయారు చేయడానికి ఎంతగానో ప్రాక్టీస్ చేశాను. నాకు బహుమతి రావడం సంతోషంగా ఉంది.

– బి.సుమశ్రీ, ప్రథమ బహుమతి విజేత

మట్టి విగ్రహాలే వినియోగిస్తాం



గతంలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాలు వినియోగించే వాళ్లు. బజారులో అవే కొనుగోలు చేసే వాళ్లం. ఈ కార్యక్రమం ద్వారా వాటి వినియోగంతో కలిగే నష్టాల గురించి తెలుసుకున్నాం. అందుకే ఇక నుంచి ప్రతి పండగకూ మట్టి విగ్రహాలే వినియోగిస్తాం.

– శృతి ద్వితీయ బహుమతి విద్యార్థిని

ఫుడ్ టెక్నాలజీకి ఉజ్వల భవిత

వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల డీన్ డాక్టర్ మణి



బాపట్ల: ఫుడ్ టెక్నాలజీకి ఉజ్వల భవిష్యత్ ఉందని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల డీన్ డాక్టర్ ఎ.మణి పేర్కొన్నారు. ఎన్జీ రంగా వజ్రోత్సవాల్లో భాగంగా 'ఫుడ్ టెక్నాలజిస్టులకు అవకాశాలు– పూర్వ విద్యార్థులచే దిశానిర్దేశం' అనే అంశంపై ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో శనివారం సెమినార్ నిర్వహించారు. డాక్టర్ ఎ.మణి మాట్లాడుతూ ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన– సాంకేతిక కళాశాల ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులచే ఫుడ్ టెక్నాలజిస్టులకు గల అవకాశాలను తెలియజేశారు. ఫుడ్‌టెక్నాలజీ కళాశాల డీన్ డాక్టర్ వై.రాధ మాట్లాడుతూ ప్రస్తుత విద్యార్థులు ఆచరించదగిన విధి విధానాలను వివరించారు. పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. డీన్ ఆఫ్ స్టూడెంట్స్ ఆక్టివిటీస్ డాక్టర్ పి.సాంబశివరావు, డాక్టర్ స్మిత్, డాక్టర్ సి.సుకుమారన్, డాక్టర్ వి.రామసుబ్బారావు, సీహెచ్‌వీవీ సత్యనారాయణ, సోమేశ్వరరావు, విమలబీర, బ్లెస్సిసాగర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారికంగా విశ్వకర్మ జయంత్యుత్సవాలు



బాపట్ల: ప్రజల సంక్షేమం, లోకకళ్యాణార్థం విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో విశ్వకర్మ జయంతి కార్యక్రమం అధికారికంగా నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పావులూరు హనుమంతరావు పేర్కొన్నారు. బాపట్ల జిల్లా కేంద్రంలోని సాయి ప్యాలెస్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో హనుమంతరావు మాట్లాడారు. బీసీ వెల్ఫేర్ డిపార్టుమెంట్, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్, చైర్మన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు. అలాగే బాపట్ల జిల్లాలోని రేపల్లె, కర్లపాలెం, చెరుకుపల్లి, ముప్పవరం, చీరాల, అద్దంకి ప్రాంతాల్లో మహాయజ్ఞాలను ఈనెల 17న నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు.

న్యూస్‌రీల్

నేడు మెగా సెల్ఫీ క్యాంపు




నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): ఇండియన్ స్వచ్ఛ లీగ్ 2.0లో భాగంగా ఆదివారం 3 వేల మందితో మెగా సెల్ఫీ క్యాంప్ నిర్వహిస్తున్నామని, క్యాంప్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి కోరారు. శనివారం బీఆర్ స్టేడియంలో స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో భాగంగా ఇండియన్ స్వచ్ఛ లీగ్ 2.0 మెగా సెల్ఫీ క్యాంప్ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇండియన్ స్వచ్ఛ లీగ్ 2.0లో నగరంలోని విద్యార్థులు, యువత గత రెండు రోజుల నుంచి పెద్ద ఎత్తున పాల్గొన్నారని, ఆదివారం బీఆర్ స్టేడియంలో 3 వేల మందితో మెగా సెల్ఫీ క్యాంప్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మెగా క్యాంప్ జరిగే స్టేడియం పరిసర ప్రాంతాల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలని ఎంహెచ్‌ఓని, తాగునీటి సదుపాయం కల్పించాలని ఎస్ఈని ఆదేశించారు. ఇండియన్ స్వచ్ఛ లీగ్ 2.0లో భారీగా ప్రజలు పాల్గొని, తమ ఫోన్ ద్వారా సెల్ఫీ తీసి యాప్‌లో అప్ లోడ్ చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం నిర్వహించే గుంటూరు నగరానికి మరోసారి జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని వెల్లడించారు.

ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తు గడువు పెంపు

నరసరావుపేట ఈస్ట్: జాతీయ ప్రతిభ అన్వేషణ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు ఈనెల 25వ తేదీ వరకు గడువు పొడిగించినట్టు ఇన్‌చార్జి డీఈఓ ఎం.వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షను డిసెంబర్ 3న రాష్ట్రంలోని అన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రాలలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. అన్ని యాజమాన్యాలలోని పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ, కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50 లక్షల లోపు ఉన్న విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులని తెలిపారు. పరీక్ష రుసుం ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.100లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50లు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రేపు 'స్పందన'కు విరామం



బాపట్ల : వినాయక చవితి సందర్భంగా సోమవారం ప్రభుత్వ సెలవు కావడంతో స్పందన కార్యక్రమం తాత్కాలికంగా నిలుపుదల చేశామని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీలు ఇవ్వడానికి సోమవారం రోజున కలెక్టరేట్‌కు ఎవరూ రావద్దన్నారు. జిల్లా ప్రజలంతా ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

ఐకమత్యమే బలహీనవర్గాల శక్తి

వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న జంగా కృష్ణమూర్తి

పిడుగురాళ్ల: బలహీనవర్గాల హక్కుల సాధనకే ఐక్యవేదిక పని చేస్తోందని, బీసీలకు తాను అండగా ఉన్నానని వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి చెప్పారు. పట్టణంలోని శ్రీసత్యసాయి కల్యాణ మండపంలో పల్నాడు జిల్లా బలహీన వర్గాల ఐక్యవేదిక నూతన కార్యవర్గ సమావేశానికి కృష్ణమూర్తి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఐక్యవేదిక ఏ ఒక్క పార్టీనో, ఏ నాయకుడినో విమర్శించటం కోసం కాదని, బలహీన వర్గాల హక్కులను సాధించుకునేందుకు మాత్రమే ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఎందరో బీసీలు ఉన్నత పదవులు అధిరోహిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఎదిగిన వారు తమ వర్గాల్లో దిగువనున్న వారి సంక్షేమానికి కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలహీనవర్గాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారని చెప్పారు. దాచేపల్లి గ్రామంలో జ్యోతిరావుఫూలే విగ్రహం ఏర్పాటు, పిడుగురాళ్ల పట్టణంలో జ్యోతిరావుఫూలే, అంబేడ్కర్, చాకలి ఐలమ్మ విగ్రహాల ఏర్పాటు ఆనందంగా ఉందని వివరించారు. అంతకుముందు ఐక్యవేదిక నేతలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ముశ్య వెంకటేశ్వర్లు, గద్దల వేదమణి, షేక్ షరీఫ్, రామాంజనేయులు, లాల్‌బాషా, పిడతల అజయ్, వీరయ్య, కొక్కర కొండలు తదితరులు పాల్గొన్నారు.

పేద కాపుల అభ్యున్నతికి కృషి

- శాసనమండలి చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు
- జిల్లాలో 11,469 మందికి లబ్ధి
- రూ.17.20 కోట్ల మేర ప్రయోజనం
- లబ్ధిదారుల హర్షం



కాపు నేస్తం నమూనా చెక్కు అందిస్తున్న శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి, ఎమ్మెల్యే కోన, జేసీ శ్రీధర్

బాపట్ల: పేద కాపుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని శాసన మండలి చీఫ్‌విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు చెప్పారు. కాపు నేస్తం నాలుగో విడత ఆర్థిక సహాయం నగదు పంపిణీ కార్యక్రమాన్ని నిడదవోలు నుంచి ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక స్పందన సమావేశ మందిరం నుంచి శాసన మండలిలో చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, జేసీ శ్రీధర్ లబ్ధిదారులు వర్చువల్‌గా వీక్షించారు. అనంతరం నమూనా చెక్‌ను లబ్ధిదారులకు అందించారు. ఉమ్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటి వద్దకే సంక్షేమాన్ని అందిస్తోందని పేర్కొన్నారు. నాలుగేళ్లలో కాపుల సంక్షేమానికి పెద్దపీట వేసినట్టు వివరించారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా కాపులకు సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి అమలుచేస్తున్నారని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జేసీ శ్రీధర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో 11,469 మంది కాపు మహిళలకు రూ.17.20 కోట్ల మేర ప్రయోజనం కలిగిందని వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ బి.అర్జునరావు, దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బి.సురేంద్ర, అగ్రికుల క్షత్రీయ కార్పొరేషన్ డైరెక్టరు కె.చెంచయ్య, వన్యకుల క్షత్రీయ డైరెక్టరు కె.మామిడయ్య, బీసీ కార్పొరేషన్ ఏఈఓ బి.వి.నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



జే.పంగులూరు: బైక్‌పై అతివేగంగా వెళ్తూ కరెంటు స్తంభాన్ని ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని తక్కెళ్లపాడు రోడ్డులో జనకవరం చెరువు సమీపంలో శుక్రవారం రాత్రి జరగగా శనివారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల సమాచారం మేరకు.. మండల పరిధిలోని పంగులూరు గ్రామానికి చెందిన కటికల క్రాంతికిరణ్ (28) రెండేళ్లుగా మేదరమెట్ల సమీపంలోని గ్రోత్ సెంటర్‌లో ఫార్మ కంపెనీలో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. రెండు రోజుల నుంచి కళ్ల కలకలు ఉండటంతో పనికి వెళ్లలేదు. శుక్రవారం ఉదయం పనిమీద ఒంగోలు వెళ్లి సాయంత్రానికి ఇంటికి వచ్చాడు. తండ్రి కాంతారావు మాట వినకుండా రాత్రి 8.30 గంటల సమయంలో ఇంటి వద్ద నుంచి తన బైక్‌పై డ్యూటీకి బయలుదేరాడు. డ్యూటీకి ఆలస్యం అవుతుందని తక్కెళ్లపాడు రోడ్డు వైపుగా గ్రోత్ సెంటర్‌కి బయలుదేరాడు. జనకవరం రోడ్డు వద్ద ఉన్న మలుపు వద్ద ఎదురుగా ఉన్న కరెంట్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టాడు. ఈప్రమాదంలో తలకు ధరించిన హెల్మెట్ కూడా పగిలిపోయింది. తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో ఎవరూ ఈ ప్రమాదాన్ని గమనించలేదు. శనివారం ఉదయం పొలం వచ్చిన రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎస్సై తిరుపతిరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తల్లిదండ్రులు విలపిస్తున్నారు.

ఆటో బోల్తా

సంతమాగులూరు(అద్దంకి): ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని మన బాలభారతి పాఠశాల వద్ద శనివారం జరిగింది. అందిన సమాచారం మేరకు.. శ్రీశైలం నుంచి అమీనాబాద్‌కు ప్రయాణికులతో వెళ్తున్న ఆటో సంతమాగులూరులోని బాలభారతి పాఠశాలకు సమీపంలోకి రాగానే అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మరో ఆటోలో క్షతగాత్రులను నరసరావుపేటలో ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. గాయపడిన వారి వివరాలు తెలియాల్సి ఉంది.

అర్హులందరికి సంక్షేమం చేరువ

- మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున
- వెల్లటూరులో గడప గడపకు మన ప్రభుత్వం



వెల్లటూరులో సంక్షేమ కరపత్రాలను అందజేస్తున్న మంత్రి నాగార్జున

వెల్లటూరు(భట్టిప్రోలు): అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం చేరువ చేస్తుందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. భట్టిప్రోలు మండలం వెల్లటూరులో శనివారం ఉదయం, సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్, రేపల్లె మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లిఖార్జునరావుతో కలసి నిర్వహించారు. మంత్రి నాగార్జున గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాలతో పొందిన లబ్ధిని వివరించారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందకుంటే సాంకేతిక కారణాలేమైనా ఉన్నాయా అని పరిశీలించాలని వలంటీర్లకు సూచించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. మంత్రి నాగార్జున మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సచివాలయల ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. పలు కారణాలతో సంక్షేమ పథకాలు అందని వారికి కూడా వర్తింపజేస్తున్నామని తెలిపారు. నిరంతరం ప్రజల కోసం పని చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలిచి రాబోయే ఎన్నికల్లో మరోసారి గెలిపించాలని కోరారు. తొలుత స్థానిక గ్రామ దేవత కట్లమ్మ తల్లి దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, సర్పంచ్ చౌటూరి లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు ధారావత్ కుమారీభాయ్, పడమట శ్రీనివాసరావు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ అజెండా

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి

రేపల్లెరూరల్: ప్రజా సంక్షేమమే అజెండాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పోటుమెరక గ్రామంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పథకాలను దిగ్విజయంగా అమలు చేసి పేదల ఆర్థిక భద్రత భరోసా కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే మరలా మరలా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే కోరుకుంటున్నారన్నారు. ప్రజలు జగనన్నకు పట్టం కట్టేందుకు మరోమారు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో 250 గృహాలను సందర్శించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు, సర్పంచ్ కాగితాల హనుమప్రసాద్, సచివాలయాల మండల కన్వీనర్ కె.కృష్ణకిషోర్ పాల్గొన్నారు.

కాపు సామాజికవర్గానికి గుర్తింపు తెచ్చింది జగనన్నే

రాష్ట్రంలో కాపు సామాజికవర్గానికి ఆర్థికంగా, రాజకీయంగా గుర్తింపునిచ్చింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. రేపల్లె మండలం పోటుమెరక గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపు సామాజిక వర్గానికి చెందిన వారికి ఉన్నతంగా రాజకీయంగా పదవులు కల్పించటంతోపాటు మహిళలకు చేయూతనిచ్చేందుకు కాపు నేస్తం పేరుతో ప్రతి సంవత్సరం రూ.15000 అందిస్తున్నారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు నాలుగు విడతలుగా రూ.2029 కోట్లను కాపునేస్తం పేరుతో నేరుగా వారి ఖాతాలలో జమ చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. కాపు సామాజికవర్గంలో గుర్తింపు తెచ్చుకున్న ముద్రగడ పద్మనాభంను, ఆయన కుటుంబ సభ్యులను దూషించి అక్రమకేసులు పెట్టించి జైలుపాలు చేసిన చంద్రబాబుకు జనసేన పార్టీ నాయకుడు పవన్‌కల్యాణ్ ఎలా మద్దతు తెలుపుతున్నాడన్నారు.

లోకేష్‌స్థాయికి నియోజకవర్గ నాయకులు చాలు

స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్కాంలో అరెస్ట్ అయి జైలుపాలైన చంద్రబాబునాయుడు నీతివంతుడంటూ దీనిపై జగన్‌మోహన్‌రెడ్డి చర్చకు రావాలంటూ లోకేష్ ప్రస్తావించటం హాస్యాస్పదమన్నారు. లోకేష్‌తో చర్చించేందుకు తమ పార్టీలోని నియోజకవర్గస్థాయి నాయకులే ఎక్కువని, తన స్థాయిని తెలుసుకుని మాట్లాడాలని హితవుపలికారు.

జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతం చేయాలి

ఏపీ వైద్య ఆరోగ్య శాఖ డెప్యూటీ డైరెక్టర్ ఫ్లోరెన్



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఏపీ వైద్య ఆరోగ్య శాఖ డెప్యూటీ డైరెక్టర్ ఫ్లోరెన్

కర్లపాలెం: రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యం కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అధికారులు విజయవంతం చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డెప్యూటీ డైరెక్టర్ ఏ.ఈ ఫ్లోరెన్ చెప్పారు. మండలంలోని చింతాయపాలెం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా జరుగుతున్న సర్వే కార్యక్రమాన్ని శనివారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని తమ గ్రామంలోనే అందించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహించనున్నదని చెప్పారు. ఈనెల 30నుంచి విడతల వారీగా అన్ని గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలందించటంతోపాటు ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బి.వీరబ్రహ్మం, సీహెచ్‌వో నాగేశ్వరరావు, సూపర్‌వైజర్ ఇసాక్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణతో తెగుళ్ల నివారణ

బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ ప్రశాంత్

చీరాలటౌన్: వేరుశనగ సాగు చేసే రైతులు తమ పొలాల్లో పచ్చదోమలు, తెగుళ్ల నివారణకు పసుసు రంగు జిగురు అట్టలు ఏర్పాటుచేసుకోవాలని బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ ప్రశాంత్ సూచించారు. శనివారం మండలంలోని కావూరివారిపాలెంలో రైతులు సాగుచేస్తున్న వేరుశనగ పంటలను బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు, అధ్యాపకులు పరిశీలించారు. పంటలో తెగుళ్లు, దోమ ఉండటాన్ని గుర్తించి వీటి నివారణకు సూచనలు చేశారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు అందించే సూచనలు పాటించాలన్నారు. దీని వలన సాగు ఖర్చులు తగ్గడంతోపాటుగా క్రిమిసంహారక మందుల వినియోగం తగ్గి అధిక దిగుబడులు సాధిస్తారన్నారు. వేరుశనగలో తెగుళ్లు, దోమలు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కే రమణారెడ్డి సూచించారు.

రసాయన రహిత పంటలతో ఆరోగ్యం

డీఎల్ఎంపీ మోహన్



మేదరమెట్ల: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన ఉత్పత్తులతో ఆరోగ్యంగా ఉంటామని జిల్లా అధికారి (డీఎల్ఎంపీ) మోహన్ అన్నారు. మండల కేంద్రం కొరిశపాడులోని ఆర్‌బీకే కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. విత్తన శుద్ధికి బీజామృతాన్ని వాడాలన్నారు. దీని వలన మొక్కలో వేరుకుళ్లు రాకుండా ఉంటుందన్నారు. ఎక్కువ రోజులపాటు మొక్క ఆరోగ్యవంతంగా ఉంటాయని, తెగుళ్లు కూడా త్వరగా ఆశించవచ్చని తెలిపారు. రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడం, గ్రామాల్లో ఎక్కువ మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో బీజామృతం తయారీ విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ప్రతినిధులు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

చట్టం ఎవరికీ చుట్టం కాదు

- చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల పొత్తుతో ఒరిగేదేమీ లేదు
- ప్రభుత్వ సలహాదారు బత్తుల ధ్వజం

పర్చూరు (చినగంజాం): ప్రజాస్వామ్యంలో రాజు, పేద సమానమేనని చట్టం ఎవరికీ చుట్టం కాబోదని, మార్కెటింగ్, కోఆపరేటివ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. పర్చూరులో శనివారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దారి మళ్లించిన రూ.371 కోట్లు అవినీతిపై రెండేళ్లుగా పలు సంస్థలు దర్యాప్తు జరిపిన విషయం తెలిసిందేనన్నారు. సీఐడీ సేకరించినసాక్ష్యాధారాలతోనే ఆయన జైలు పాలయ్యారని బత్తుల అన్నారు. చంద్రబాబు పరామర్శ కోసం జైలుకు వెళ్లిన జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పొత్తుల గురించి ప్రకటించడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు, లోకేష్‌లు వందల కోట్లు ప్రజాధనం లూటీ చేశారని విమర్శించిన పవన్‌కల్యాణ్ నేడు ఏమార్పు కోసం తండ్రి, తనయుల పల్లకీ మోసే బోయిగా మారారో చెప్పాలని ప్రశ్నించారు. తనపై సీబీఐ తదితర కోర్టుల విచారణలు జరగకుండా గత దశాబ్ద కాలంగా చంద్రబాబు స్టేలు తెచ్చుకొని కాలం గడుపుతున్న సంగతి పవన్ కళ్యాణ్‌కు కనిపించకపోయినా ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు.



జడ్జిలపై ఎల్లో మీడియా దాడులు హేయం..

కోర్టు తీర్పులు తమకు అనుకూలంగా వస్తే సంతోషించడం, వ్యతిరేకంగా వస్తే జడ్జిలపైన, న్యాయ వ్యవస్థపైన ఎల్లో మీడియా ద్వారా దాడులు చేయించటం ఏ విష సంస్కృతికి నిదర్శనమో రెండు పార్టీల నాయకులు చెప్పాలని ఆయన ప్రశ్నించారు. నాడు ప్రజారాజ్యం పార్టీకి లక్షలాది ప్రజలు ఓటు వేసి మద్దతుగా నిలబడితే సోదర త్రయం పార్టీని సోనియాగాంధీ పాదాల వద్ద తాకట్టు పెట్టారన్నారు. నేడు పవన్‌కళ్యాణ్ జనసేన పార్టీని, కేడర్‌ను జైలులో ఉన్న చంద్రబాబుకు పాదాక్రాంతం చేశారని బత్తుల ఎద్దేవా చేశారు. ప్రజా సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్ అప్పు చేస్తే నానా యాగీ చేసిన పవన్‌కల్యాణ్‌కు చంద్రబాబు దారి మళ్లించిన రూ.371 కోట్లు నిరుద్యోగులు ప్రజాధనం నేరంగా కన్పించకపోవడం దారుణమన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల అపవిత్ర పొత్తు వలన రాష్ట్రంలో ఒరిగేదేమీ ఉండబోదని మరోసారి జగన్‌మోహన రెడ్డి సీఎంగా గెలవడం ఖాయమన్నారు.